క్లుప్తంగా

వైకుంఠ రథం ప్రారంభం



వేల్పూర్: పచ్చలనడ్కుడలో స్వర్గీయ ఏనుగు గంగారాం స్మారక వైకుంఠ రథాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. గంగారాం కుమారుడు, స్థానిక ఉపసర్పంచ్ ఏనుగు గంగారెడ్డి రూ. 2.75 లక్షలతో రథాన్ని గ్రామానికి వితరణ చేశారు.

బీఆర్ఎస్ కార్యాలయం..

వేల్పూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. దీంతో పాటు అంక్సాపూర్ రోడ్డు వద్ద రూ.40 లక్షలతో నిర్మించే స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు, రూ.20 లక్షలతో అమీనాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద వేల్పూర్ రహదారిపై నిర్మించే కల్వర్టు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నానని పేర్కొన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, వేల్పూర్ సర్పంచ్ తీగెల రాధామోహన్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' పరిశీలన

వేల్పూర్: అక్లూర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. ఎంత మందికి కంటి పరీక్షలు చేశారు, ఎంత మందికి కంటి అద్దాలు ఇచ్చారు..తదితర వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుదర్శనం, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. 26వ వార్డ్ కౌన్సిలర్ సుజాత రమేష్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. అలాగే 17వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ముగ్గురికి అందజేశారు.

రెంజల్ మండల కేంద్రంలో..

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అందించారు. గ్రామానికి చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ వివరించారు. రఫీక్, వెంకట్, సమీ, నారాయణ, బాలాజీ, సాయిబాబా పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల విద్యార్థులకు ముప్కాల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ క్రీడా దుస్తులను అందించారు. వాటిని సోమవారం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

బోధన్ ఎంపీడీవోగా శ్రీనివాస్

బోధన్ రూరల్ (బోధన్): బోధన్ నూతన ఎంపీడీవోగా శ్రీనివాస్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

రుద్రూర్: జంతువుల పక్షోత్సవాల సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జంతువుల సంరక్షణ పౌరుల బాధ్యత అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి, మండల విద్యాధికారి శాంత కుమారి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రాజ్ మంజుషా పాల్గొన్నారు.

గ్రామసభలకు స్పందన

రెంజల్(బోధన్): గ్రామ పంచాయతీలకు వచ్చే జీపీడీపీ నిధుల వ్యయంపై సోమవారం మండలంలో నిర్వహించిన గ్రామసభలకు స్పందన లభించింది. సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఎంపీడీవో శంకర్ మాట్లాడుతు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పనులను గుర్తించాలని సూచించారు. ప్రాధ్యాన్యమున్న పనులను ముందుగా ఎంపిక చేసి పరిష్కరించాలన్నారు. సర్పంచ్ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

నవీపేట: నాళేశ్వర్ గ్రామ శివారులోని రాజరాజేశ్వరాలయ ప్రాంగణంలో రూ.30 లక్షల వ్యయంతో వీడీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన షెడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ ద్యాగ సరిన్ సోమవారం భూమి పూజ చేశారు. దాతలను ఈ సందర్భంగా సన్మానించారు. బినోల సొసైటీ మాజీ చైర్మన్ కిషోర్‌రావ్, మాజీ సర్పంచులు సాయిరెడ్డి, నర్సింగ్‌రావ్, వీడీసీ ప్రతినిధులు చిన్న భీమ్‌రెడ్డి, గంగాధర్, సంజీవ్, పోశెట్టి పాల్గొన్నారు.

నేతాజీ అడుగుజాడల్లో నడవాలి

జిల్లాలో పలు చోట్ల స్వాతంత్ర్య సమర యోధుడు, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశభక్తి, క్రమశిక్షణలో సుభాష్ చంద్రబోస్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో వర్నిలో ర్యాలీ నిర్వహించారు. రెంజల్ మండలం సాటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. బోధన్‌లో సాయి ఆదర్శ మండలి, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



వర్నిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు



వర్నిలో ..డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి



నందిపేటలో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో..



మామిడిపల్లిలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు



నలంద హైస్కూల్‌లో ..



బషీరాబాద్‌లో .. నవోదయ యువజన సంఘం సభ్యులు



బోధన్‌లో.. సాయి ఆదర్శ సంఘం ప్రతినిధులు

బాల్ ఠాక్రేకు నివాళులు

బోధన్‌టౌన్(బోధన్): శివసేన పార్టీ వ్యవస్థాపకులు బాలా సాహెబ్ ఠాక్రే 97వ జయంతిని పట్టణంలో శివసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 100 మంది శివసేన నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శివసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసులోటి గోపికిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, లోకేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.



బోధన్‌లో రక్తదానం చేస్తున్న శివసేన నేతలు

ప్రజలతో సిబ్బంది మంచిగా మెలగాలి



బోధన్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మా శరత్ రెడ్డి తనిఖీ చేశారు. కంటి పరీక్షలు చేయించుకోవడానికి కేంద్రానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. చికిత్స చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. పరీక్షల కోసం కేంద్రానికి వచ్చే ప్రజలతో సిబ్బంది మంచిగా మెలగాలని, వారికి కావాల్సిన పరీక్షలు చేయించి అవసరమైన మందులు ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. చైర్ పర్సన్ వెంట కమిషనర్ ఖమర్ హైమద్, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, అక్తర్ అహ్మద్, గంగారాం, అబ్దుల్ అహ్మద్, వినోద్ ఉన్నారు.

శిబిరాల పరిశీలన

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో, మండలంలోని పోచంపాడ్ జీపీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. శిబిరాల్లో రోజుకు 200 మంది చొప్పున పరీక్షలు చేయాలని సూచించారు.



పోచంపాడ్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక ఎంపీడీవో బాల గంగాధర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మండల వైద్యాధికారి ఆయేషా సిద్ధిఖీ, క్యాంపు కో– ఆర్డినేటర్ సుమతి, నేత్ర వైద్యురాలు శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా జిల్లా కోసం పోరాడుదాం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌ను జిల్లాగా సాధించుకోవడానికి ఐకమత్యంగా ముందుకు సాగి పోరాడాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు పిలుపునిచ్చారు. బోధన్‌ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సోమవారం న్యాయవాదులు కూర్చున్నారు. ఈ దీక్షలకు విద్యార్థులు, ఏఐఎస్‌బీ నాయకులు సంఘీభావం తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు పోవాలి



ఆర్మూర్‌టౌన్: మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో భార్గవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని విద్యా హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏకీకృత శిశు అభివృద్ధి సేవల పథకం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ.. సమాజంలో బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేఖ, టీచర్లు పద్మ, మమత, రేణుక, కేశవమ్మ, సంగీత పాల్గొన్నారు.

కోటగిరి ఎంపీడీవోగా మనోహర్‌రెడ్డి



కోటగిరి : కోటగిరి ఎంపీడీవోగా కేఆర్ మనోహర్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మారుతి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగారు. మనోహర్‌రెడ్డి గతంలో ఎడపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు.సమస్యలపై ఎంపీపీ వల్లేపల్లి సునీతతో పాటు తనను కూడా సంప్రదించవచ్చని ఈ సందర్భంగా కేఆర్ మనోహర్‌రెడ్డి చెప్పారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

బాల్కొండ: వరి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం నాగాపూర్‌లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వరి పంటలో జింకు లోపాన్ని గమనించి వెంటనే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల నీటిని పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజెల్ 120 గ్రాములు లేదా ఐసోప్రతియోనిల్ 400 ఎంఎల్ 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో మొగి పురుగు నివారణ కోసం 4జీ గుళికలను 8 కిలోలు చల్లాలని, యూరియాను మోతాదుకు మించి వాడవద్దన్నారు. రైతు బంధు కో–ఆర్డినేటర్ రాజారెడ్డి, ఏఈవో కృష్ణవేణి పాల్గొన్నారు.



నాగాపూర్‌లో వరిని పరిశీలిస్తున్న అధికారి

సంక్షిప్తం

'పార్టీ బలోపేతానికి కృషి చేస్తా'



బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తానని నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిని, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. రవీందర్ రెడ్డి, మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

రెంజల్(బోధన్): వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, కూలీలకు పాలక ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రెంజల్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో 60 లక్షలకు పైగా వ్యవసాయ కూలీలు ఉపాధిలేక విలవిల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం జీవనం కొనసాగించడానికి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రక్షణ గోడ ఎత్తును పెంచాలని వినతి

నవీపేట: యంచ గ్రామ శివారులోని గోదావరి నది బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడ ఎత్తును పెంచాలని యంచ సర్పంచ్ కొట్టాల లహరి, గ్రామస్తులు సోమవారం జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రక్షణ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో మానసిక వేదనకు గురైన బాధితులు గోదావరి నదిలో దూకి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అలాగే బ్రిడ్జికి ఇరువైపులా ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిశాక కలెక్టర్ నారాయణరెడ్డి, సీపీ నాగరాజులను కలిసి ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు తెలియజేశారు.

నేటి వ్యాసరచన పోటీల్లో పాల్గొనండి

బోధన్‌టౌన్(బోధన్): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మంగళవారం బోధన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే పోటీల్లో పాల్గొనాలని ఎఫ్ఎల్ఎస్ నోడల్ అధికారి నాగయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలనుసారం 8 వ తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్) చదివే విద్యార్థులకు ఉప విద్యాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం అనే మూడు అంశాలపై పోటీలు నిర్వహిస్తారని, ప్రతీ అంశానికి పాఠశాలల నుంచి ఒక విద్యార్థి, కళాశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్స్, కన్వీనర్లకు సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎవరి సామగ్రి వారే తెచ్చుకోవాలని సూచించారు.

అవమానాలకు గురవుతున్నాం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాస్త ప్రభాకర్



సమావేశం బహిష్కరించి మాట్లాడుతున్న ఎంపీటీసీలు

- మాక్లూర్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆవేదన
- బయటకు వెళ్లిపోయిన ఏడుగురు ఎంపీటీసీలు

మాక్లూర్: అడుగడుగునా అవమానాలకు గురవుతున్నామని మదన్‌పల్లి ఎంపీటీసీ గోపూరు ఒడ్డెన్న ఎంపీడీవో సమావేశం హాల్ నుంచి వెళ్లిపోయారు. కొద్ది సేపటికే ఆయనను అనుసరిస్తూ కొత్తపల్లి ఎంపీటీసీ ఒక్కెర పురుషోత్తంరావు, మాదాపూర్ ఎంపీటీసీ బొంత లలిత ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోయారు. సోమవారం ఎంపీడీవో సమావేశం హాల్‌లో ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. తొలి డీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ గంగామణికి సమావేశం ఎజెండా కాపీ పంపకుండా అవమాన పర్చారని, ఇది సరైంది కాదని కొత్తపల్లి ఎంపీటీసీ పురుషోత్తంరావు విచారం వ్యక్తం చేశారు. వరుసగా మూడు సార్లు సమావేశానికి హాజరుకానందున ఎజెండా కాపీ పంపలేదని ఎంపీడీవో క్రాంతి సమాధానం ఇచ్చారు. అనంతరం మాక్లూర్ ఎంపీటీసీ సాయినేని వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. మైనార్టీ రుణాలు మండలానికి ఎన్ని యూనిట్లు వచ్చాయని వాటిని కూడా దళిత బంధు మాదిరిగానే ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే ఇస్తారా అంటూ సభలో ప్రశ్నించారు. మండలానికి 5 యూనిట్లు వచ్చాయని 244 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో క్రాంతి సమాధానం చెప్పారు. ఎంపిక అనేది బ్యాంకర్లు చూస్తారన్నారు.

ఒంటెద్దు పోకడలను భరించలేకపోతున్నాం..

ఎంపీపీ మాస్త ప్రభాకర్ అవలంభిస్తున్న ఒంటెద్దు పోకడలతో నలిగిపోతున్నామని మదన్‌పల్లి ఎంపీటీసీ గోపూరు ఒడ్డెన్న ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మామిడిపల్లి, మాక్లూర్–2, మాక్లూర్, డీకంపల్లి, మాదాపూర్, కొత్తపల్లి ఎంపీటీసీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా మా సంతకాలు లేకుండానే ఏక పక్ష నిర్ణయాలతో తీర్మానాలు జరిగిపోతున్నాయన్నారు. ఎంపీటీసీలకు వచ్చిన నిధులను కూడా ఎంపీపీ తన సొంత గ్రామం గుత్ప‌లో 60 శాతం కేటాయించుకుని మిగితా ఎంపీటీసీలకు నామమాత్రంగా కేటాయించారని ఆరోపించారు. వివక్ష వీడి ఎంపీటీసీలను సమానంగా చూడాలన్నారు.

కొన్ని చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం, మరి కొన్ని గ్రామాల్లో దొడ్డు బియ్యం పంపిణీ ఏమిటని మామిడిపల్లి ఎంపీటీసీ సత్యనారాయణ, తహసీల్దార్ శంకర్‌ను ప్రశ్నించగా తన దృష్టికి రాలేదని ఈ విషయమై ఆరా తీస్తానని చెప్పారు. ఇది ఇలా ఉండగా మండల సర్వసభ్య సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు వచ్చే సరికి సమావేశం ముగించేశారు. తాను వస్తున్నానని చెప్పినా కూడా అర్ధాంతరంగా సమావేశం ముగించటంలో అంతర్యమేమిటని జెడ్పీ చైర్మన్, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టుదలతో చదివితేనే భవిష్యత్తు

రెంజల్(బోధన్): విద్యార్థులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే విజయాలను సాధించవచ్చని నియోజకవర్గ బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునేందుకు పాఠశాల స్థాయి నుంచి లక్ష్యాలను ఎంపిక చేసుకుని ఆ దిశగా పయనించాలని సూచించారు. ప్రధానమంత్రి 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో భాగంగా సోమవారం రెంజల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ముందు ఆందోళనకు గురికాకుండా ప్రధాని పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. పరీక్షలకు ముందు భయాలను వదిలి ఆత్మ విశ్వాసంతో ముందుకు పయనించాలన్నారు. జెడ్పీటీసీ మేక విజయ, నాయకులు చుక్కరాజుగౌడ్, పోచయ్య, బాలరాజు, నర్సింగ్, సుదర్శన్, సంతోష్, యోగేష్, గోపి, శ్రీధర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నేతలు ప్రకాశ్ రెడ్డి, మోహన్ రెడ్డి

ఆధ్యాత్మికం..

నేటి నుంచి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం నుంచి ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. 27 వరకు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వేంపల్లిలో..

ముప్కాల్ మండలం వేంపల్లిలో వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. 24న వినాయక పూజలు, 25న మండపారాధన 26న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుంది. అనంతరం అన్నదానం చేస్తారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శివాలయంలో లింగానికి పంచామృతంతో అభిషేకం చేశారు. అలాగే రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప ఆలయాలను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు శేఖర్‌రెడ్డి, సుమన్, పీసీ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపన



కమ్మర్‌పల్లి: మండలంలోని శ్రీరాజరాజేశ్వరీ నగర్‌లో ఆదివాసి నాయక్‌పోడు సంఘం ఆధ్వర్యంలో సోమవారం భీమన్న దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్మించిన దేవాలయంలో వేద పండితుల నేతృత్వంలో భీమన్న దేవతామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అమరగోని రోజా, సదాశివ్‌గౌడ్, మల్లయ్య ఉన్నారు.

శుక్రవారం దేవి జాతర ప్రారంభం



కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో సోమవారం శుక్రవారం దేవీ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవీ అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి గ్రామం నుంచి మహిళల మంగళ హారతులు, వాయిద్యాలతో ఊరేగింపుగా శివారులోని ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం పూజలు నిర్వహించారు.

SAKSHI
కావలెను
నిజామాబాద్, కామారెడ్డి మరియు నిర్మల్ జిల్లాలో ఎక్కడైనా
సర్వీస్ రిప్రజెంటేటివ్స్ (SR) గా
పని చేయుటకు ఆసక్తిగల యువకులు కావలెను.
అర్హత : ఇంటర్ పాస్ లేదా డిగ్రీ పాస్ వయస్సు : 19 నుండి 30 సం॥లోపు
అనుభవం: ఇతర దినపత్రికలలో సేల్స్ విభాగంలో పనిచేసినవారు, వివిధ కంపెనీలలో మార్కెటింగ్ రంగాలలో పనిచేసిన వారికి మరియు కొత్త వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తిగలవారు తేది: 27-01-2023 శుక్రవారము రోజున ఉ॥ 11 గం॥ల నుండి 3 గం॥ల లోపు బయోడేటా, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, జిరాక్స్ సర్టిఫికెట్లతో సంప్రదించండి.
ఇంటర్వ్యూ జరుగు స్థలం:
సాక్షి టౌన్ ఆఫీస్ రైల్వే స్టేషన్ దగ్గర, కవిత కాంప్లెక్స్, నిజామాబాద్
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) :
70955 23222
ఎ.సి.ఓ. సెల్ :
99510 27699

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబు : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ పి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899